గంటన్నరలో పరీక్ష మొదలు.

ముందురోజు రాత్రి కాకినాడ జేరుకున్నాను. నాతో బాటు ఎమ్‌సెట్ రాస్తున్న మా ఊరు రాజీగాడు- మహేశ్వర్‌తో కలిసి వచ్చి కాకినాడ మా అమ్మమ్మగారింట్లో దిగాను.

మా అమ్మమ్మ ఆచారం సంగతి నాకు తెలుసు కనుక భయపడి రాజీగాణ్నీ మహేశ్‌నీ ఆ రాత్రి హోటల్లో భోజనం చేయండర్రా అని పంపించాను. కాదు..తినిపించాను.

పొద్దున్నే బయల్దేరి సెంటర్ చూసుకుని దగ్గర్లో ఉన్న ఆనంద్ భవన్ హోటల్‌కి వెళ్లాం.

# గురుదక్షిణ



మూడు ప్లేట్లు ఇడ్లీ ఆర్డర్ చేశాం.

బేగ్‌లో పుస్తకాలు బైటికి తీశాం. అందరం కలిసొచ్చాం గానీ, ఒకరికొకరు పోటీ పడుతున్నాం. ఒకర్నొకరు అణగదొక్కి నిలవాలి.

కాంపిటీటివ్ పరీక్షలంటే అదే. మనం బాగా రాయటం కాదు అవతలి వాడు మన కన్నా బాగా రాయకూడదు. నాకెందుకో ఈ దుష్టబుద్ధి నచ్చలేదు గానీ...బాగానే అలవాటైంది.

మేథమెటిక్స్‌లో ఒక రెండు ప్రొబ్లెమ్స్ సాల్వ్ చేయటం నాకు అస్సలు చేతకావట్లేదు.

దొంగలా పుస్తకం తీసి, మెల్లగా మా వాళ్లని అడిగాను నాకు తెలియనట్లు కాదు. వాళ్లకి తెలుసా అని అడగటానికి- నేను నేర్చుకుందామని.

వాళ్లు తెల్లమొహం వేశారు. కొంత ఆనందం.

మా డిస్కషన్ ప్రొప్రైటర్ వింటున్నాడు. అందరికీ సరిగ్గా టిఫెన్స్ సర్వ్ అవుతున్నాయా లేదా అజమాయిషీ చేస్తున్నాడు అతను. ఉండుండి అతని చూపు చెవి మా మీద పడుతోంది.

ముగ్గురం వాగ్వివాదాలు పడుతున్నాం.

"అయినా కాంపిటీటివ్ పరీక్షలకి ఎ బి సి డి టిక్ చేయడమే కదా. ఈ గందరగోళం దేనికి" అన్నాడు రాజీగాడు.

"కళ్లు మూసుకుని ఏదో అక్షరం మీద టిక్కు పెట్టే గుడ్డాట కాదురా... ప్రొబ్లెం తెలిస్తే ఆన్సర్ ఈజీ అవుతుంది" మహేశ్ చెప్పాడు.

"అదీ పాయింట్" బలంగా అన్నాను.

"హౌటు సాల్వ్ ఇట్"

ఓనర్ మా దగ్గరకొచ్చాడు.

"బాబూ...నేను ఈ హోటల్ పెట్టినప్పుడు కర్నాటకలో మేథ్స్ డిగ్రీ చేశాను. మాకూ మీకూ పుస్తకాలూ, మెథడ్స్ మారతాయి గానీ...అంకెలు మారవు. అప్పుడూ ఇప్పుడూ అవే అంకెలు!!"


చాలా సింపుల్‌గా జవాబు చెప్పి దాటిపోబోయాడు.

పేపర్ నేప్‌కిన్ తీసుకుని ఆ ప్రాబ్లెం సెకన్స్‌లో సాల్వ్ చేశాడు.

అందరం షాక్!!!

"నీకివన్నీ...అహ...మీకవన్నీ ఎలా తెల్సు..."

"బాబూ...నేను ఈ హోటల్ పెట్టిన ప్పుడు కర్నాటకలో మేథ్స్ డిగ్రీ చేశాను. మాకూ మీకూ పుస్తకాలూ, మెథడ్స్ మార తాయి గానీ...అంకెలు మారవు. అప్పుడూ ఇప్పుడూ అవే అంకెలు!!" చాలా సింపుల్‌గా జవాబు చెప్పి దాటిపో బోయాడు.




"అంత తెలివితేటలు ఉండి మీరిలా హోటల్ పెట్టుకొనీ..." నా ప్రశ్న పూర్తవ్వలేదు.

"హోటల్ పెట్టుకోటానికి తెలివితేటలు అక్కర్లేదా?" అన్నాడాయన.

మాకు జవాబు దొరకలేదు.

నవ్వుకుంటూ వెళ్లిపోయాడు ప్రొప్రైటర్.

నేను చల్లగా అతను సాల్వ్ చేసిన లెక్కని జేబులో కుక్కుకున్నాను. మా వాళ్లు మళ్లీ ఆ కాయితం చూడకుండా గబగబా టిఫెన్ తినేయమని తొందరపెట్టి...కంగారు పెట్టి... ఇంకా హడావుడి పెట్టి ఎగ్జామ్ హాల్‌కి పరిగెట్టించాను.

నిజంగా హోటల్ ప్రొప్రైటర్ రాసిచ్చిన నేప్‌కిన్ నాకెంతో ఉపయోగపడింది.

★ ★ ★

మూడేళ్లు గడిచాయి.

గుల్బర్గాలో నాకు బి.ఇ. సీటు వచ్చింది. అమ్మమ్మకి వంట్లో బాగాలేదంటే హడావు డిగా కాకినాడ వెళ్లాను.

అంత హడావుడిలోనూ...కాస్త ఖాళీ చేసుకుని ఆనంద్‌భవన్‌కెళ్లాను.

అవే బెంచీలు అదే ప్లానింగ్. సర్వర్లు కూడా మారలేదు. ప్రొప్రైటర్ సీట్లో లేడు.

ఒక సీట్లో కూచున్నాను. వెయిటర్ వచ్చాడు. ఏం తింటా... భోంచేసొచ్చా.


"ఓ కాఫీ" ఆర్డర్ చేశాను.

కాఫీ తెచ్చాడు. తాగుతున్నాను.

బిల్లు తెచ్చి పెట్టాడు వెయిటర్.

ప్రొప్రైటర్ తన సీట్లోకొచ్చి కూచున్నాడు. ఆయన పేరేంటో నేను కనుక్కోలేదు. కానీ ఆయన్ని మర్చిపోలేదు.

తెల్లటి జుట్టు సగంపైకి పోయి ఉంది. తెల్లటి మీసాల్లో అక్కడక్కడ గ్రే టచ్ - చెవి చివరిదాకా సాగిన (ఆగిన) సైడ్! మిగిలిన కొద్ది భాగం నీట్ షేవింగ్- దబ్బపండు రంగు మొహంలో బ్యూటీస్పాట్ లాంటి స్ఫోటకం మచ్చలు. అయినా ఎంతో అందంగా, గొప్పగా అనిపిస్తాడు. మనకి నచ్చిన మనిషి ఎలా ఉన్నా అతన్లో నచ్చిన విషయాల వల్ల అందంగా కనిపిస్తాడని నాకో నమ్మకం. వాళ్లలో ఉన్న టేలంటే వాళ్లకి గ్లామర్.




గ్లామర్ అంటే అందం కాదు. ఆక ర్షణ.

ఆ మాటకొస్తే మన దేవుళ్లలో చాలా మంది రకరకాల జంతువుల రూపంలో ఉంటారు. వాళ్లది అందం కాదు. అద్భుత మైన ఆకర్షణ. కోయిల నల్లగా ఉంటుంది. పాట తీయగా ఉంటుంది. ఘంటసాల ఎన్టీఆర్ అంత అందంగా ఉండకపోవచ్చు గాక... అంతకన్నా నాకు నచ్చుతాడు.

నాకు ఆనంద్‌భవన్ ప్రొప్రైటర్ గుర్తొచ్చినప్పుడల్లా ఆయన ఎంతో నచ్చేస్తాడు.

దేవుళ్లా అనిపిస్తాడు. అది అతను నాకు చేసిన సాయం వల్ల కాదు. ఆ లెక్క చేస్తోన్నప్పుడు అతను చూపిన చాక చక్యం- ఆలోచనలో ఆగని వేగవంతమైన క్లారిటీ.

మూడేళ్లుగా- అతను నా ముందు వంగి పేపర్ నేప్‌కిన్ మీద టకటకా వేసిన స్టెప్స్, వేస్తున్నప్పుడు కనిపించిన కాన్ఫిడెన్స్... నా మెదడులో ముద్ర వేసుకుని ఉన్నాయి.

ఆయనలో ఏం మార్పు లేదు.

నేనీ మూడేళ్లలో బాగా మారాను. రేజర్ వాడేంత ఎదిగిపోయాను. నీడబట్టున హాస్టల్‌లో తిండీ... పక్కనే కాలేజీ కనక కాస్త రంగు కూడా వచ్చాను. నన్నాయన పోల్చుకో లేడు. పైగా రెగ్యులర్ కస్టమర్ని కాను. అకేషనల్ అతిథిని.

కాఫీకి ఇచ్చిన బిల్లు సోంపు పోసిన ప్లేట్‌తో దగ్గరకి లాక్కున్నాను. కాఫీ 3 రూపా యలు. నేను నవ్వుకున్నాను. 3 రూపాయలతో బాటు వస్తూ వస్తూ ముప్పై రూపా యలు పెట్టి ఆయన కోసం కొన్న కేజీ కాకినాడ కాజా నా బేగ్‌లోంచి తీసి బిల్లుపైన పెట్టాను. వెయిటర్ ఇచ్చిన ప్లేట్‌తో ఆయన ముందుకు వెళ్లాను. అనుకున్నట్లుగానే నన్ను గుర్తు పట్టలేదు.

'ఏంటి' అన్నట్లు తలెత్తి చూశాడు.

నేను పరిచయం చేసుకున్నాను. ఫ్లాష్‌బేక్ చెప్పాను.

"మీరావాళ చెప్పిన రెండు లెక్కలూ నాకెంతో ఉపయోగపడ్డాయి. మీరావేళ అనాయాచితంగా వచ్చి వేసిన రెండు లెక్కలూ ఆవేళ పరీక్షలో అక్కరకొచ్చాయి. నేను 90 పర్సెంట్ గెయిన్ చెయ్యగలిగానంటే మీరు చేసిన హెల్పే కారణం" ఈ మాటలు చెప్తుంటే నా గొంతు వణికింది. "నేప్‌కిన్‌తో పరీక్ష హాల్లోకెళ్లిన నాకు కాపీ చేయటం తప్ప నిపించినా తప్పదనిపించింది. నేను బీటెక్ సీటు సంపాదించుకున్నాను" అని ఉన్న కథ ఉన్నట్లు చెప్పాను.

ఆయన తప్పు పట్టుకోలేదు. చల్లగా నవ్వాడు.

"ఇది గురుదక్షిణ అనుకోండి" అంటూ మొహమాట పడ్డాను.

ఆయన తియ్యగా నవ్వాడు.

"అమ్మో...నాకు కూడా ఓ శిష్యుడు ఉన్నాడన్నమాట" అన్నాడు షేక్ హేండిస్తూ.

కృతజ్ఞతాభావంతో నా కళ్లు చెమరిస్తు న్నాయి. కానీ...

ఆయనెందుకు థ్రిల్ అయిపోవ ట్లేదు??

నాకు అర్థం కాలేదు.

అదంతే...అన్నీ ఉన్న ఆకు అణిగి మణిగి ఉంటుంది.

ఏమీ లేని వాళ్లం...ఎగిరెగిరి పడతాం. కాదు ఎక్కడికో వెళ్లిపోతాం అనిపించింది.

*